క్లుప్తంగా

నేత్రదానం


పద్మావతి (ఫైల్)


శివకోటారెడ్డి (ఫైల్)

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామానికి చెందిన దగ్గ పద్మావతి (72) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు పద్మావతి నేత్రాలను నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్‌కు దానం చేసినట్లుగా మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. ఐ టెక్నీషియన్ వేణు ఆమె కళ్లను సేకరించారు. 2017 సంవత్సరంలో పద్మావతి భర్త కృష్ణయ్య నేత్రదానం చేశారు.

⇨ **విడవలూరు:** విడవలూరు గ్రామంలోని రేబాలవారి వీధికి చెందిన బెజవాడ శివకోటారెడ్డి (72) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు ఆయన నేత్రాలను నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్‌కు దానం చేసినట్లుగా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గతంలో శివకోటారెడ్డి భార్య కూడా నేత్రాలను దానం చేశారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(బృందావనం): చెన్నైకి చెందిన షెల్టర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది బాలలకు పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శుక్రవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, ట్రస్ట్ నిర్వాహకుడు సాల్మన్ రాజ్, కో–ఆర్డినేటర్ స్టీవెన్, సభ్యుడు శివకుమార్, ప్రసాద్, ఎ.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నెల్లూరు (టౌన్): ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ ఆర్.బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి 5 వరకు నిర్వహించనున్నారు.

కనులపండువగా బంగారు గరుడసేవ


రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామి వారికి తిరుమంజనం, పూజలు విశేషంగా సంప్రదాయంగా, శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు, వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో, రాత్రి బంగారు గరుడసేవలో భక్తులను కటాక్షించారు. సాయంత్రం పూలంగి సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. మోహినీ అవతారం, బంగారు గరుడసేవల ఉభయకర్తలుగా సిద్ధవరపు శివకుమార్‌రెడ్డి, సనాతనరెడ్డిలు వ్యవహరించారు. పూలంగిసేవ ఉభయకర్తలుగా నాయుడు ఆదికేశవరెడ్డి, నారాయణరెడ్డిలు వ్యవహరించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➡ శ్రీకృష్ణచరిత మానస ప్రచారమండలి ఆధ్వర్యంలో ఛత్రాలను సమర్పించారు. ఆ సంస్థకు చెందిన సభ్యులు నవాబుపేట మైపాడుగేట్ సెంటర్‌లో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి వారి సన్నిధి నుంచి రంగనాథుడి వద్దకు గొడుగులు (ఛత్రములు)ను తీసుకొచ్చి సమర్పించారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో భక్తిశ్రద్ధలతో గౌర పూర్ణిమ



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌రోడ్డు వద్ద ఇస్కాన్ మందిరంలో శుక్రవారం గౌర పూర్ణిమను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో మందిరంలో గౌరనితాయ్‌కి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా శుకదేవస్వామి ఉపన్యసిస్తూ కలియుగంలో హరి నామ సంకీర్తన ముక్తికి ఏకైక మార్గమన్నారు. సాక్షాత్తు భగవంతుడే గౌరవ ప్రభువుగా అవతరించారన్నారు. హరేకృష్ణ హరేరామ మహామంత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉద్యమంగా తీసుకెళ్లి ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగించిన గౌరంగ ప్రభువు ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎస్పీ సతీమణి ప్రణవ్ గౌతమి విచ్చేసి అభిషేకాలు నిర్వహించారు.

త్రినేత్రం నిఘా

- నేరాల నిర్ధారణకు కూడళ్లలో సీసీ కెమెరాలు
- స్థానికుల సహకారంతో ఏర్పాటు
- ఎస్పీ కృష్ణకాంత్ ప్రశంసలు


ముత్తుకూరు కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు


బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ముత్తుకూరు: పారిశ్రామిక కేంద్రంగా నానాటికి విస్తరిస్తున్న మండల పరిధిలో స్థానికేతరులు, వాహనాల రాకపోకలు అధికంగా ఉండడం వల్ల శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మండలంలోని పలు కీలకమైన కూడళ్లు, ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘాపై దృష్టి సారించింది. ముత్తుకూరు పోలీసుస్టేషన్ పరిధిలోని 32 లోకేషన్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ కృష్ణకాంత్ ఇటీవల ప్రారంభించారు.

నేర నియంత్రణ, నేర నిర్ధారణ

నేరాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు దర్యాప్తునే వేగవంతం చేసి నేరాలు నిర్ధారించడంతో పాటు నేర నియంత్రణకు ఈ సీసీ కెమెరాలు దోహదపడతాయని పోలీసులు భావిస్తున్నారు. వాస్తవ పరిస్థితులు, ఘటనలను స్పష్టంగా గుర్తించి, కేసులు నమోదు చేసేందుకు కూడా ఇవి ఉపకరిస్తాయని చెబుతున్నారు. ఈ కారణంగా మండలంలోని బ్రహ్మదేవి, ఏపీజెన్‌కో రోడ్డు ప్రాంతంలో 16 సీసీ కెమెరాలు అమర్చి, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నేలటూరు ఏపీజెన్‌కో ప్రాజెక్ట్, పైనాపురంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ప్రాజెక్ట్, కృష్ణపట్నం బీచ్ రోడ్డు కూడళ్లను పర్యవేక్షిస్తూ కృష్ణపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పామాయిల్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నివాసం ఉంటున్న పంటపాళెంలో కూడా కంట్రోల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, జనావాసాలు, వాణిజ్య సముదాయాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీల ఎదుట కెమెరాలు



జిల్లాలో 5,000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్పీ భావిస్తున్నారు. ఈ మేరకు టీపీగూడూరు పోలీసుస్టేషన్ పరిధిలో 100 కెమెరాలు ఏర్పాటు చేస్తాం. కృష్ణపట్నం పోలీసుస్టేషన్ పరిధిలో 50 కెమెరాలు ఏర్పాటు చేయడం పూర్తయింది. ముఖ్యంగా స్థానికుల సహకారంతో ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు చేయాలని ఎస్పీ ఆదేశించారు. పంటపాళెంలోని ప్రతి పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను కోరాం.

– రవినాయక్, సీఐ, కృష్ణపట్నం సర్కిల్

కూడళ్లలో సీసీ కెమెరాలు చాలా అవసరం



ముత్తుకూరులోని ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. స్థానికేతరులు అధికంగా నివాసం ఉంటున్న ప్రాంతం కావడం, వీటి అవసరం చాలా ఉంది. సీసీ కెమెరాల నిఘా వల్ల రాత్రి వేళ నిశ్చంతగా ఉంటున్నాం. పోలీసు అధికారులు ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమం వ్యాపారస్తులకు చాలా మేలు కలిగిస్తుంది.

– చందా వెంకటస్వామి, ప్రొవిజన్ స్టోర్స్ యజమాని, ముత్తుకూరు

ఆనందోత్సాహాలతో హోలీ


కొడవలూరు మండలంలోని నార్తురాజుపాలెంలో..

కొడవలూరు: మండలంలో హోలీ పండగను చిన్నారులు, యువకులు శుక్రవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొంటూ సందడి చేశారు. నార్తురాజుపాళెం, కొడవలూరు, గండవరం, యల్లాయపాళెం ప్రధాన కూడళ్లలో పిల్లలు రంగులు చల్లుకొంటూ ఆనందంగా గడిపారు.

⇨ **ముత్తుకూరు:** హోలీ పండగ శుక్రవారం ముత్తుకూరు మండలంలో కోలాహలంగా జరుపుకున్నారు. ఏపీజెన్‌కో, ఎస్ఈఐఎల్ ఎనర్జీ, కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ ఫ్యాక్టరీల్లో పని చేసే వలస కార్మికుల కుటుంబాల్లో ఉదయం నుంచి హోలీ పండగ సందడి మొదలైంది. పురుషులు, మహిళలు తేడా లేకుండా రంగులు చల్లుకొంటూ సందడి చేశారు. ముత్తుకూరు, నేలటూరు, పైనాపురం, పంటపాళెం, మామిడిపూడి, ఈపూరు, నారికేళపల్లి తదితర పంచాయతీల్లో హోలీ సంబరాలు కోలాహలంగా మారాయి. మధ్యాహ్నం వరకు రంగులు చల్లుకొంటూ సందడి చేశారు.

⇨ **తోటపల్లిగూడూరు:** హోలీ వేడుకలను శుక్రవారం మండల ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. పిల్లలు, యువత రెట్టించిన ఉత్సాహంతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందించారు. గతంలో నగరాలకే పరిమితమైన ఈ వేడుకలను కొద్ది కాలంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు జరుపుకొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు కావడంతో విద్యార్థులు పెద్ద సంఖ్యలో హోలీని ఆనందోత్సవాల మధ్య జరుపుకొన్నారు.


ముత్తుకూరులో రంగులు చల్లుకొంటున్న వలస కార్మికులు

వీఆర్‌కు రైల్వే సీఐ బదిలీ

నెల్లూరు(క్రైమ్): అవినీతి ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రైల్వే సీఐగా భుజంగరావు 2023 సెప్టెంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా ఆయనపై ఆరోపణలున్నాయి. ఈ విషయమై కొందరు సిబ్బంది గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనాను స్వయంగా కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల జనవరి నెలాఖరున నెల్లూరులో ఎస్పీ విచారణ చేశారు. ఈక్రమంలో భుజంగరావును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన నేడు

ఉదయగిరి: వరికుంటపాడు మండలం కనియంపాడు రెవెన్యూ పరిధిలోని అగ్రిగోల్డ్ భూముల్లోని జామాయిల్ చెట్ల అక్రమ నరికివేత నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు క్షేత్ర స్థాయిలో శనివారం పరిశీలించనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరుగ మురళీధర్, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు. అగ్రిగోల్డ్ భూములను పరిశీలించి తహసీల్దార్, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. అనంతరం మీడియా, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా చేపడుతున్న కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అగ్రిగోల్డ్ భూముల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే సంపదను అక్రమంగా నరికి సొమ్ము చేసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి


కరపత్రాలు అందజేస్తున్న నేతలు

కోవూరు: కోవూరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యం దారుణంగా ఉందని, దీనిపై దృష్టి సారించాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ వెంకమరాజు అన్నారు. శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర కోవూరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులకు నూతన పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. పొదుపు మహిళలకు రుణమాఫీ చేయాలని, సున్నా వడ్డీకి రుణాలివ్వాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గండవరపు శేషయ్య, బట్టా పెద్దబ్బయ్య, బాబు, చాన్ బాషా, వెంకటరమణయ్య, ఫాతిమా, రామిశెట్టి వెంకటేశ్వర్లు, కత్తి శీనయ్య, అంకిం సురేష్, గండవరపు సురేష్, కాకి నరసయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు


సొసైటీ సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్థానిక మినీబైపాస్‌లోని గెస్ట్‌ఇన్‌లో శుక్రవారం జిల్లా యాదవ ఎంప్లాయిస్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాత్కాలిక జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా పల్లా శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా యనమల జానకిరామ్ నియమితులయ్యారు. సొసైటీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు దామినిబోయిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సొసైటీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉడతా వెంకటేశ్వర్లు, జగదీష్, కాళ్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మన్మథరావు, మురళి, శివ, సుకుమార్, సురేష్‌బాబు, కోటేశ్వరరావు, సుంకు వెంకటేశ్వర్లు, గురవయ్య, ప్రవీణ్, ప్రసాద్, జయరామయ్య పాల్గొన్నారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు


భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న రామానుజ జీయర్‌స్వామి

పొదలకూరు : స్థానిక శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భాగవత సప్తాహంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిల రామానుజజీయర్ స్వామి పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు లక్ష్మీనారాయణ ఇష్టి సకలాభిష్ట సిద్ధికి పూజలు నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు భాగవత సప్తాహం దేవస్థానంలో నిర్వహిస్తున్నారు.

శ్మశానాన్ని ఆక్రమించడం దారుణం


మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్

ఇందుకూరుపేట: మండలంలోని కొరుటూరు గిరిజనుల శ్మశానాన్ని ఆక్రమించడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్ అన్నారు. నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఆక్రమణకు గురైన శ్మశానాన్ని పరిశీలించారు. గిరిజనులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా గిరిజనులు ఈ స్థలాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ బంధువుల పేర్లతో పత్రాలు సృష్టించారన్నారు. వీటితో శ్మశానాన్ని కాజేయాలని గిరిజనులను బెదిరిస్తున్నారన్నారు. సోమరాజుపల్లి గ్రామ సర్వేయర్ విజయ్‌కుమార్ కొరుటూరుకు వచ్చి గిరిజనులను కులం పేరుతో దూషించి ఆక్రమణదారులకు అండగా నిలవడం ఏమిటని ప్రశ్నించారు. అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం


బుచ్చిరెడ్డిపాళెం: వేణుగోపాల స్వామి రథోత్సవం

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేటలో శ్రీలక్ష్మి నరసింహస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాల నడుమ ఊరేగింపు జరిగింది. భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఉత్సవం సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

⇨ కొమరిక గ్రామంలో శ్రీకుంభేశ్వరస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది.

పంచేడులో..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు గ్రామంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరోరోజైన శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవారిని రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా కోలాటం, నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బొమ్మ కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉత్సవానికి ఉభయకర్తలుగా బొమ్మ శరత్‌కుమార్‌రెడ్డి, శాంతి దంపతులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


ఇందుకూరుపేటలో రథోత్సవం

కష్టపడి చదివితే విజయం మీదే..


విద్యార్థికి వాచ్ అందజేస్తున్న దృశ్యం

కోవూరు: విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే కష్టపడి చదవాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని ట్రెయినీ డీఎస్పీ ఎ.శివప్రియ తెలిపారు. కోవూరులోని వసతి గృహాల్లో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాయనున్న 80 మంది విద్యార్థులకు స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయ సమావేశ మందిరంలో శుక్రవారం పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాచ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివప్రియ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రభుత్వం శక్తి యాప్ ప్రవేశపెట్టిందని, అత్యవసర సమయాల్లో ఈ యాప్ ఆడపిల్లలకు ఉపయోపడుతుందన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు పెద్ది మారుతి నాగార్జున, సత్యవతిని అభినందించారు. కోవూరు ఏఎస్‌డబ్ల్యూఓ తిరుపతయ్య మాట్లాడుతూ దాతలు కల్పించిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. ఎస్సై రంగనాథ్‌గౌడ్ మాట్లాడారు. సంక్షేమాధికారులు వెంకటయ్య, వెంకట్రావు, రాంబాబు, పద్మ, సుప్రజ పాల్గొన్నారు.

విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

మనుబోలు: పాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో స్వామివారికి స్నపన తిరుమంజనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమాలకు గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అడుగడుగునా అంతులేని నిర్లక్ష్యం

- బ్రహ్మోత్సవాల నిర్వహణలో దేవదాయ శాఖ అధికారుల వైఫల్యం
- మండిపడుతున్న భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్నవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అడుగడుగునా దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఉత్సవాల ముందు నిర్వహించే సమన్వయ కమిటీ సమావేశం నుంచి స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవం నిర్వహణ వరకు అన్నింటిలోనూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బ్రహ్మోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనుకున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని సైతం ఏర్పాట్ల విషయంలో తప్పుదోవ పట్టించారనే విమర్శలున్నాయి. ఏటా ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశం నుంచి ఉత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించేవారు. వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించేవారు. ఈ దఫా సమన్వయ కమిటీ సమావేశం నుంచి ఉత్సవాల ఏర్పాట్ల వరకు కనీసం మీడియాకు సమాచారం కూడా ఇవ్వలేదు. చివరకు ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికలు, ఉత్సవాల షెడ్యూల్‌ను కూడా మీడియాకు విడుదల చేయలేదు. చివరకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కల్యాణోత్సవానికి హాజరవుతున్న విషయాన్ని కూడా ఆ శాఖ అధికారులు పట్టించుకోలేదు, మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఉత్సవాలకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, ఆటోల ద్వారా గ్రామాల్లో ప్రచారాన్ని కూడా నామమాత్రంగా నిర్వహించి మమ అనిపించారు. భక్తులకు చల్లటి మంచినీరు, మజ్జిగ, రద్దీకి తగిన విధంగా తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదుల, తదితర సౌకర్యాలు కల్పించే విషయంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొక్కుబడులు, కల్యాణోత్సం సందర్భంగా సామాన్యుల అవస్థలు వర్ణనాతీతం. రెండున్నర గంటలకు పైగా కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు కనీసం వాటర్ ప్యాకెట్లు కూడా ఇవ్వలేదు. కల్యాణోత్సం తరువాత స్వామివారి తలంబ్రాల పంపిణీలోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. స్వామివారి తలంబ్రాలు అందకపోవడంపై భక్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

రథోత్సవం విషయంలోనూ...

కొండపైన ఉత్సవాల ఏర్పాట్ల విషయం నుంచే అధికారుల తప్పిదాలు బయటపడుతున్నా చక్కదిద్దుకునే దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. హనుమంతసేవ రోజు బాణసంచా పేలి ఆటో దగ్ధమైన ఘటనలో గంట వరకు ఫైరింజన్ కూడా రాలేదు. అంటే భక్తుల భద్రతలో దేవదాయ శాఖ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ఫైరింజిన్ కొండ దిగువనే అందుబాటులో ఉండేది. ఈ దఫా ఇటువంటి జాగ్రత్తలు అసలు పట్టించుకోలేదు. కీలకమైన రథోత్సవం విషయంలోనూ ఇదే తప్పిదాలు చేశారు. రథం ఒరిగిపోవడం వంటి పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అధికారులు అందుకు భిన్నంగా ప్రవర్తించారు. రథోత్సవానికి రథం సిద్ధంగా ఉందా.. లేదా అనే విషయాన్ని కూడా పట్టించుకోలేదు. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై భక్తులు, కొండబిట్రగుంట, పాతబిట్రగుంట ప్రజలు తీవ్రస్థాయిలో భగ్గుమంటున్నారు. అదే విధంగా కొండపైన ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం కూడా పెరిగిపోయిందని మండిపడుతున్నారు.


నిలిచిపోయిన రథోత్సవం వద్ద గుమిగూడిన భక్తులు